www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 18 నవంబర్ 2024

5

తిరుపతి



నేడు టిటిడి పాలక మండలి సమావేశం

- గతంలో అధికారులు తీసుకున్న 50అంశాలపై చర్చ
- టిటిడిలో అన్యమతస్థుల అంశం ప్రధాన అజెండా

ప్రజాశక్తి -తిరుమల: టిటిడి నూతన పాలక మండలి సమావేశం సోమవారం నిర్వహించ నున్నారు. గతంలో ఎనిమిది నెలలు టిటిడి అధికారులు తీసుకున్న నిర్ణయాలు 50 అంశాలపై చర్చించ నున్నారు. 80 అంశాలకు నూతన పాలక మండలి సవరణలు చేయనుంది. ఇందులో ప్రధానంగా ఎనిమిది నెలలుగా శ్రీవారికి కావలసిన నైవేద్యాలు, ముడి సరుకులు కొనుగోలు, టిటిడిలో అన్య మతస్థుల అంశాలు చర్చ రానుందని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ సూచనలు మేరకు తిరుమల కొండపై ఎలాంటి రాజకీయనాయకుల వ్యాఖ్యలపై, టిటిడిపై దుష్ప్రచారం చేసే సోషల్ మీడియాపై చర్చకు రానుంది. శ్రీనివాస సేతు పేరుతో గత ప్రభుత్వం నామకరణం చేయగా గతంలో ఉన్న గరుడ వారధి పేరునే కొనసాగించాలని ఆప్కాన్ సంస్థ ప్రతినిధులు కోరగా గరుడ వారధిని కొన సాగిస్తామని ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు.

నారా రామ్మూర్తికి కన్నీటి వీడ్కోలు

- సంతాపం తెలిపిన గవర్నర్
- సినీ ప్రముఖులు, ఎంపిలు, ఎమ్మెల్యేల నివాళి
- పాడె మోసిన చంద్రబాబు, నారా లోకేష్
- తలకొరివి పెట్టిన కొడుకు నారా రోహిత్
- అంతిమయాత్రలో నారా, నందమూరి కుటుంబ సభ్యులు

రామ్మూర్తి పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వారి కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి): శనివారం హైదరాబాద్ గచ్చిబౌలి ఏఐజి హాస్పిటల్‌లో అనారోగ్యంతో రామ్మూర్తి నాయుడు (72) మరణించారు. ఆయన పార్థివదేహాన్ని మంత్రి నారా లోకేష్, నందమూరి రామకృష్ణ ప్రేత్యక విమానంలో ఆదివారం ఉదయం 8 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిడిపి నాయకులు, అధికారులు ప్రత్యేక వాహనంలో నారావారిపల్లెకు తీసుకొచ్చారు. చంద్రబాబు ఇంటి ఆవరణలో రామ్మూర్తి పార్థివ దేహానికి పూలమాల వేసి కన్నీటితో కుటుంబసభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు అనారోగ్యంతో మరణించడంతో నారా చంద్రబాబు నాయుడు కన్నీటిపర్యంతమయ్యారు. తమ్ముడి కొడుకులు నారా గిరీష్, నారా రోహిత్, తమ్ముడి భార్య ఇందిరకు తాను అండగా ఉన్నానంటూ ధైర్యం చెప్పారు. రామ్మూర్తి నాయుడున్ని సందర్శించేందుకు పోలీసుల బందోబస్తు నడుమ విఐపిలు, టిడిపి శ్రేణులకు, ప్రజలకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అంతిమయాత్రలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రామ్మూర్తి నాయుడు అంతిమయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన అశేష జనవాహినికి స్థానికులు తాగునీరు, భోజనాలు, కూర్చోవడానికి ప్రత్యేకంగా షెల్టర్లు ఏర్పాటు చేశారు. తిరుపతి అడిషనల్ ఎస్పీలు రవి మనోహరాచారి, వెంకట్రావుల ఆధ్వర్యంలో చంద్రగిరి డీఎస్పి బి.ప్రసాద్, చంద్రగిరి సుబ్బరామిరెడ్డి నేతతంలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించి నారావారిపల్లి గ్రామానికి ప్రజలను అనుమతించారు.

తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు అంతిమసంస్కారాల కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఉదయం 10 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరకున్నారు. అక్కడి నుంచి వాహానాల్లో 11 గంటలకు నారావారిపల్లికి చేరుకున్నారు. నారావారిపల్లెకు సీఎం చంద్రబాబుతోపాటు భార్య నారా భువనేశ్వరి, కోడలు నారా బ్రాహ్మణి,, మనవడు నారా దేవాన్ష్ చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పి సుబ్బరాయుడు, ఎమ్మెల్యే పులివర్తినాని రామ్మూర్తి నాయుడు పార్థివ దేహానికి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రామ్మూర్తి నాయుడు అంతిమయాత్రలో అన్న చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నాని, నారా, నందమూరి కుటుంబ సభ్యులు పాడెను మోసారు. చంద్రబాబు మాట్లాడుతూ తన తమ్ముడు రాజకీయంగా తనకు అండగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, తెలుగుదేశం పార్టీ అభివద్ధికి కష్టపడిన తీరు, అజాతశత్రువుగా కల్మషం లేకుండా అందరితో కలిసిమెలిసి నడిచారని గుర్తుచేసుకుంటూ చంద్రబాబు కన్నీళ్లు పెట్టుకున్నారు.

రామ్మూర్తి నాయుడికి శ్రద్ధాంజలి...

సీఎం చంద్రబాబుకు గవర్నర్, ప్రముఖులు సంతాపం..

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తమ్ముడి మరణవార్త తెలుసుకున్న మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ఆదివారం నారావారిపల్లెకు చేరుకుని రామ్మూర్తి నాయుడు పార్థవ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. చంద్రబాబుకి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. గవర్నర్‌తోపాటు చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, చంద్రగిరి, సత్యవేడు, పలమనేరు, చిత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, పూతలపట్టు, నగరి, ఎమ్మెల్యేలు పులివర్తినాని, కె.ఆదిమూలం, ఎన్.అమరనాథరెడ్డి, గురజాల జగన్‌మోహన్, బొజ్జల సుధీర్ రెడ్డి, కె.రామకృష్ణ, కె.మురళీ మోహన్, గాలి భానుప్రకాష్, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎం.మోహన్ బాబు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, టిటిడి అదనపు ఈవో వెంకయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, మోహన్, ఎస్‌సివి నాయుడు, శ్రీనివాథ్ రెడ్డి, ఎఎస్.మనోహర్, చదలవాడ కృష్ణమూర్తితోపాటు సినీ ప్రముఖులు రాజేంద్రప్రసాద్, మంచు మనోజ్, నాగసౌర్య టిటిడి పాలక మండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ టిడిపి, బిజెపి, జనసేన పార్టీల జిల్లా నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆత్మబంధం.. అంతిమ యాత్ర..

తన తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు తనకు దూరమయ్యాడని బాధతో సీఎం చంద్రబాబు నాయుడు శోకసంద్రంలో మునిగిపోయారు. సాయంత్రం నాలుగు గంటలకు అంతిమ సంస్కారాలు ప్రారంభమయ్యాయి. చంద్రబాబు అమ్మ అమ్మన్నమ్మ, నాన్న ఖర్జూరపు నాయుడు సమాధుల వద్ద దహన సంస్కారాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రామ్మూర్తి నాయుడు పాడెను స్వయంగా చంద్రబాబు, నారా లోకేష్ వారి భుజాలపై మోసారు.

అంత్యక్రియల్లో..

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు..

రామ్మూర్తి నాయుడు అంతక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో పోలీసులు గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించి గాలులోకి కాల్పులు జరిపి వందన సమర్పణ చేశారు. సాంప్రదాయపద్ధతిలో అంత్యక్రియలు జరిపారు. రామ్మూర్తి చిన్నకొడుకు సినీనటుడు నారా రోహిత్ తండ్రికి తల కొరివిపెట్టి అంత్యక్రియలు ముగించారు. కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు, ప్రముఖులు కన్నీటి వీడ్కోలు పలికారు.

తిరుగు ప్రయాణమైన సీఎం కుటుంబం..

నారావారిపల్లెలో నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు ముగిసిన అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, నారా బ్రాహ్మణి,, నారా భువనేశ్వరిలు ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

నివాళి అర్పిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్, ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, టిటిడి మాజీ అధ్యక్షులు చదలవాడ కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు, డప్పు కొట్టిన మందకృష్ణ మాదిగ, గౌరవ వందనం సమర్పించిన పోలీసులు

5కే రన్‌లో పాల్గొన్న డాక్టర్లు..ప్రముఖులు

నవజాత శిశువుల రక్షణకు 5కే రన్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: నవజాత శిశువులను రక్షించుకునేందుకు అవగాహ న కల్పిస్తూ చేపట్టిన 5కే రన్‌ను స్థానిక ఆర్‌టిసి బస్టాండు వద్ద తిరుపతి నగర మేయర్ డాక్టర్ అర్ శిరీష ఆదివారం జెండా ఊపి ప్రారంభిం చారు. ప్రీ టర్మ్ బేబీస్‌పై అవగాహన కల్పించేం దుకు అంకుర ఆస్పత్రి ఆధ్వర్యంలో 5కేరన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తల్లి గర్భంలో బిడ్డగా ఎదగడానికి నవ మాసాల గడువు ఉంటుందనీ, నెలలు నిండకుండానే పుట్టినప్పుడు ఆ నవజాత శిశువులో అనేక సమ స్యలు వచ్చే ప్రమాదం వుందని, గతంలో ఇలాంటి పిల్లలకు చికిత్స నామమాత్రంగానే వుండేదని, ప్రస్తుతం ఆధునిక వైద్యంతో అన్ని రకాల రక్షణ ఏర్పాట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ (ఐఎపీ) తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఏఆర్ రెడ్డి మాట్లాడుతూ.. నెలలు నిండకుండా పుట్టే బిడ్డలకు వచ్చే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం నవంబర్ 17న ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే జరుపుకుంటున్నామని తెలిపారు. ఐఏపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీఎస్ అంజన్ కుమార్ మాట్లాడుతూ నెలలు నిండని శిశువులు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించడానికి ఈ రోజు జరుపుకుంటారని సూచించారు. అంకుర హాస్పిటల్స్ తిరుపతి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీ కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జన్మించిన మొత్తం పది మంది శిశు వులలో ఒకరు ప్రీటర్మ్ బేబీ వున్నారని తెలిపారు. ప్రముఖ నియోనటాలజిస్ట్ డాక్టరు జగదీష్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణాలకు అకాల పుట్టుక ప్రధాన కారణం అని, నెలలు నిండని జననమే కారణమన్నారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రేష్మా రెడ్డి మాట్లాడుతూ.. నెలలు తక్కువగా జన్మించిన చిన్నారులను కాపాడుకోవడం కోసం ప్రస్తుతం వైద్య రంగంలో వున్న అనేక అధునాతన వైద్య సదుపాయాలు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఏపీ ట్రెజరర్ డాక్టర్ సతీష్ బిల్లా, డాక్టర్ తేజస్విని, డాక్టర్ దినేష్, డాక్టర్ పృథ్వి, డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ రవిచంద్ర, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఇంటి నుంచి అదృశ్యమైన ఇంటర్ విద్యార్థి ముని శ్యాంను టూ టౌన్ పోలీసులు ఆదివారం తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పట్టణం లోని ఎంజీఎం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువు తున్న విద్యార్థి మునిశ్యాం ఈ నెల 15వ తేదీ ఇంటి నుంచి అదృశ్యమైన ఘటనపై టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైన విషయం తెలిసిందే. దర్యాప్తు చేపట్టిన పోలీసులు విజయవాడలో మునిశ్యాం ఉండటాన్ని గుర్తించి ఫోన్ ద్వారా శ్రీకాళహస్తికి రప్పించారు. అనంతరం సీఐ వెంకటేశు లు ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

తీరనున్న దాహార్తి

- బాలాజీ రిజర్వాయర్ పనులు వేగవంతం
- మల్లెమడుగు రిజర్వాయర్ పనులకు మోక్షం
- జిజిఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ రాకతో పనులు ముందుకు..
- కొంత నిధులు భరించేందుకు టిటిడి సిద్ధం
- రెండవ దశ అటవీ అనుమతుల కోసం ప్రతిపాదన సిద్ధం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: గత ప్రభుత్వ హయాంలో తాగు, సాగు నీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు. దీని ప్రభావం వల్ల జిల్లాలో కరువు కాటకాలతో పాటూ అతివృష్టి, అనావృష్టికి దారి తీసింది. బాగా వర్షాలు కురిసినా డ్యామ్ గేట్లు కొట్టుకు పోవడంతో అందులో ఉన్న నీళ్ల వృథాగా సముద్రంలో కలిసిన విషయం అందరికీ తెలిసిందే. తిరుపతి యాత్ర స్థలంలో గత ఏడాది వేసవి కాలంలో తాగునీటి కష్టాలు వచ్చి పడ్డాయి. తిరుపతి వాసులకు తాగు సాగునీరు అందించే ప్రాజెక్టులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారింది. తిరుపతి జిల్లాకు తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ మల్లికార్జునరెడ్డి నేతత్వంలో బాలాజీ రిజర్వాయర్‌తో పాటు మల్లెమడుగు డ్యామ్ విస్తరణ పనులు చేపట్టేందుకు నడుం బిగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిఎన్ఎన్ఎస్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ మల్లికార్జున్ రెడ్డి ఇటు తిరుపతి వాసులకు , అటు తిరుమల వాసులకు తాగునీరు అందించేందుకు బాలాజీ రిజర్వాయర్ నిర్మాణ పనులు చేసేందుకు యుద్ధ ప్రాతిపదిక చర్యలు చేపట్టారు. తిరుపతి తిరుమల వాసులకు గ్రావిటీ ద్వారా మల్లెమడుగు జలాశయానికి 2 టీఎంసీలు నీటిని తరలించేలా బాలాజీ జలాశయానికి రూపకల్పన చేశారు. జిఎన్ఎస్ ఎస్‌డిపిఆర్ ప్రకారం ఒక టీఎంసీని తిరుపతి , తిరుమలకు వినియోగించాల్సి వుంది. అప్పట్లో టిడిపి ప్రభుత్వ హయాంలో 10:28 పనులు పూర్తయ్యాయి. వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టు పనులు పట్టించుకోలేదు. అంచనాలు మాత్రం 65.5 కోట్లకు పెంచారు. ఇందులో కొంత భాగం నిధులు ఇచ్చేందుకు టిటిడి అంగీకరించింది. రెండోసారి అటవీ అనుమతుల కోసం రూ.28 కోట్లు మేరకు చెల్లించాల్సి ఉంటుందని అంచనా.. ఇప్పుడు నిధులు చెల్లించి పనులు చేసేందుకు అధికారులు ముందుకు సాగుతున్నారు.

బాలాజీ జలాశయం సామర్థ్యం 3.082 టీఎంసీలు కాగా, బండ్ పొడవు 3.335 కిలోమీటర్లుగా వుంది. అటవీ ప్రాంతంలో1.585 కిలోమీటర్లు మేర అటవీ భూమి: 477.75 హెక్టార్లు సేకరించాల్సి వుంది.

మల్లె మడుగు రిజర్వాయర్ పనులు 45 శాతం పూర్తయ్యింది. ఐదేళ్ల క్రితం కురిసిన భారీ వర్షం సమయంలో 9 టీఎంసీల నీరు వచ్చినా కిందకు వదలాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాజెక్టు తొలిదశ అటవీ అనుమతులు వచ్చాయి. రెండో దశ అనుమతుల కోసం అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. ఏడాది క్రితం పనులు పూర్తి చేసేందుకు రై.175 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. కొత్త ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు సిద్ధం చేస్తున్నారు. అటవీ అనుమతులకు ఎంత నిధులు ఎంత మేరకు చెల్లించాలో అంచనాలు సిద్ధం చేస్తున్నారు. అంచనాలు మల్లెమడుగు జలాశయానికి అవసరమైన అటవీ అనుమతులు పొందిన తర్వాత పనులు వేగవంతం చేసేందుకు జిఎన్ఎస్ఎస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మల్లెమడుగు జలాశయం 2.676 టీఎంసీలు సామర్థ్యం కాగా, బండ్ పొడవు 4.40 కిలోమీటర్లు మేర వుంది. 117.581 హెక్టార్లు సేకరించాల్సిన అటవీ భూమి సేకరించాల్సి వుంది.

సీఎం ఆదేశాలతో పనులు వేగం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా రెండో దశ అటవీ అనుమతుల సాధనకు నిధులు చెల్లించే ప్రక్రియ చేపట్టాం. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం అంచనాలు రూపొందించి ప్రభుత్వం నుంచి ఆమోదముద్ర వేయించనున్నాం. త్వరలోనే టెండరు ప్రక్రియ చేపడతాం..

- మల్లికార్జున్ రెడ్డి, తెలుగు గంగ సిఇ.

నేలపట్టులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: విదేశీ పక్షులకు విడిది కేంద్రమైన నేలపట్టు ఆదివారం పర్యాటకుల సందడితో కోలాహలంగా మారింది. ప్రాముఖ్యత కలిగిన పక్షుల కేంద్రాల్లో ఒకటైన నేలపట్టు పక్షుల కేంద్రం కలకత్తా- చెన్నై రహదారి, దొరవారిసత్రంకు రెండు కిలోమీటర్ల సమీపంలో ఏర్పాటు అయివుంది. ఈ కేంద్రంలో పలు విదేశాల నుండి నేలపట్టు పక్షులు కేంద్రంలో విడిది చేసి పిల్లలను పొదిగి తిరిగి ఏప్రిల్‌లో యథావిధిగా వాటి స్వదేశాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. అక్టోబర్ మొదలు ఏప్రిల్ వరకు నేలపట్టు పక్షుల కేంద్రాన్ని ఎందరో పర్యాటకులు సందర్శించి వినోదం పొంది వెళు తుంటారు. ఆదివారం సెలవు దినం కావడంతో అనేక మంది పర్యాటకులు, విద్యార్థులు, కుటుంబ సమేతంగా సందర్శించి వెళ్లారు. పక్షుల నివాస ప్రాంతం మూడు వైపులా ఓ మోస్తరు దట్టమైన అడవి, దిగువ భాగం పచ్చటి పొలాలతో ఆహ్లాదమైన వాతావరణం ఉండడంతో వందల కొద్ది పర్యాటకులు సందర్శ నార్థం వచ్చారు. అంతే కాకుండా జింకల పార్కు చిన్నారులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి సంతోషి స్తుంటారు. పర్యాటకుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు పక్షుల కేంద్రంలోనే వైల్డ్ లైఫ్ అధికారులు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా పలు రకాల స్వదేశీ, విదేశీ పక్షుల ఆగమనం,

వాటి చరిత్రను వివరించేందుకు గైడ్ ను ఏర్పాటు చేశారు. సమీప రాష్ట్రమైన తమిళనాడు నుండి పర్యాటకులు నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శిస్తుంటారు.

టోటల్ స్టేషన్ ట్రైన్ వర్క్ షాప్ విజయవంతం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీ శిరిడిసాయి ఇంజనీరింగ్ అకాడమీ తిరుపతిలో ఆదివారం నిర్వహించిన టోటల్ స్టేషన్ ట్రైన్ వర్క్ షాప్ విజయవంతమైంది. ఇందులో భాగంగా టోటల్ స్టేషన్‌పై ఉన్న జాబ్ అవకాశాలు గురించి ఇన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ ఈ నరసింహులు వివరించారు. సర్టిఫికేషన్ కోర్సెస్ ఇన్ టోటల్ స్టేషన్ ఆటో క్యాడ్ ఫర్ డిప్లమా స్టూడెంట్స్‌కి ప్రొవైడ్ చేస్తున్నామని, విత్ రీజనబుల్ కాస్ట్ గెస్ట్ రవిచంద్ర టోటల్ స్టేషన్ ఎక్స్పర్ట్ మాట్లాడుతూ టోటల్ స్టేషన్‌పై జాబ్ ఆపర్చునిటీస్ గురించి వివరించారు. సర్టిఫికేషన్ కోర్సెస్ వన్, త్రీ, సిక్స్ మంత్స్ ప్రొవైడ్ చేస్తున్నామని, కోర్సెస్ కంప్లీట్ అయిన తర్వాత సర్టిఫికెట్‌తో పాటు వందశాతం ప్లేస్‌మెంట్స్ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిపిఎం తిరుపతి రూరల్ కార్యదర్శిగా కె సుమన్

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: సిపిఎం తిరుపతి రూరల్ కార్యదర్శిగా కె సుమన్‌ను ఎన్నుకున్నారు. తిరుపతి రూరల్ మహాసభ సిపిఎం జిల్లా కార్యాలయంలో కె సుమన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ జయచంద్ర మాట్లాడుతూ తిరుపతి రూరల్ పరిధిలో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రూరల్ ప్రాంతంలో ప్రభుత్వ భూములు అన్ని కబ్జాకు గురవుతున్నాయని, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. చెరువులు, గుంటలు, వాగులు, వంకలు, ఆక్రమణ గురవుతున్నా అధికారులు, ప్రభుత్వం వాటిని పరిరక్షించడంలో విఫలమవుతు న్నాయన్నారు. బఫర్ జోన్ లో నిర్మించకూడదని చట్టం చెబుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, కబ్జా గురైన ప్రభుత్వ చెరువులు కాపాడాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం తిరుపతి రూరల్ కమిటీని ఎన్నుకున్నారు. సిపిఎం తిరుపతి రూరల్ కార్యదర్శిగా కే సుమన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు సభ్యులుగా జి చిన్న బాబు, ప్రకాష్, బాలాజీ, భాను, శ్రీనివాసులు, కృష్ణ భాస్కర్, రాజశేఖర్, పౌర్ణమిలను ఎన్నుకున్నారు.

శ్రీనివాస సేతు కాదు..గరుడవారధే..

ప్రజాశక్తి -తిరుమల: తిరుపతిలోని శ్రీనివాససేతు ఫ్లై ఓవర్ పేరును ఆఫ్కాన్ సంస్థ మార్చింది. శ్రీనివాస సేతు స్థానంలో గరుడ వారధిగా పేరును అధికారులు మార్చేశారు. 2018 గరుడ వారధి పేరుతో ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం గరుడవారధి స్థానంలో శ్రీనివాస సేతుగా పేరును మార్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో అధికారులు తిరిగి గరుడవారధిగా పేరును మార్చారు. నగర ప్రజల నుండి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందిన నేపథ్యంలో పాత పేరుని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నేడు జరగనున్న పాలకమండలి సమావేశంలో చర్చించనున్నారు.

అర్హులందరికీ హౌసింగ్ పథకం

- ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా లబ్ధిదారుల గుర్తింపు
- జిల్లా హౌసింగ్ పీడీ శ్రీనివాస్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 2019 నుండి ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో, తిరుపతి జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ హౌసింగ్ పథకాన్ని వర్తింప చేయడానికి గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన ప్రణాళికను అమలు చేస్తున్నామని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్‌తో ప్రజాశక్తి నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రజాశక్తి: ఇప్పటివరకు హౌసింగ్ పథకం ద్వారా ఎంత మందిని లబ్ధిదారులుగా గుర్తించారు?

హౌసింగ్ పీడీ: 2019 నుండి ఉమ్మడి చిత్తూరు జిల్లా, విభజన తిరుపతి జిల్లాలోని మండలాలలో 77,765 మందిని లబ్ధిదారులుగా గుర్తించాం. లబ్ధిదారులు వారికి కేటాయించిన స్థలాలలో ఇళ్ల నిర్మాణం చేసుకోవడానికి హౌసింగ్ పథకం ద్వారా అన్ని అనుమతులు, బిల్లులను సకాలంలో చెల్లింపులు చేస్తున్నాం.

ప్రజాశక్తి: హౌసింగ్ పథకం ద్వారా కేటాయించిన ఇళ్లలో ఇప్పటివరకు ఎన్ని ఇళ్లను పూర్తి చేశారు?

హౌసింగ్ పీడీ: హౌసింగ్ పథకం ద్వారా లబ్ధిదారులుగా 77,765 ఇళ్లలో ఇప్పటి వరకు 25,729 ఇళ్లను పూర్తి చేసాం. ఇంకా 8,155 ఇళ్లు స్లాబ్ దశలో నిర్మాణంలో ఉన్నాయి. 2,469 ఇళ్లు ఇప్పటికీ నిర్మాణం ప్రారంభం కాలేదు. నిర్మాణం చేయకపోవడానికి కారణాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకుని, వారు వీలైనంత త్వరగా వారి సొంత ఇంటి కలలు నెరవేర్చుకోవడానికి గృహ నిర్మాణ శాఖ తగిన సహకారాలను అందించడానికి సిద్ధంగా వుంది.

ప్రజాశక్తి: హౌసింగ్ పథకం తిరుపతి జిల్లాలో ఏ విధంగా అమలు చేస్తున్నారు?

హౌసింగ్ పీడీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హౌసింగ్ పథకంను జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు వేరువేరుగా నిర్వహిస్తున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(అర్బన్), ప్రధానమంత్రి ఆవాస్ యోజన(రూరల్) కింద లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి హౌసింగ్ పథకం ద్వారా ఇళ్లను నిర్మించుకునేలా తగిన సహకారాన్ని అందిస్తున్నాం. నాలుగు సంవత్స రాల ప్రణాళికలో భాగంగా అర్బన్ లో 70, 985, రూరల్ ప్రాంతాల్లోని లబ్ధిదారులు 6,780 మందిని గుర్తించి హౌసింగ్ పథకాన్ని అమలు చేస్తున్నాం.

ప్రజాశక్తి: హౌసింగ్ పథకంపై కూటమి ప్రభుత్వం ప్రస్తుత ఆదేశాలు ఏమైనా ఉన్నాయా?

హౌసింగ్ పీడీ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సమీక్షలలో హౌసింగ్ పథకం గురించి చర్చించాం.. దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్ హౌసింగ్ శాఖ అధికారులతో రివ్యూ సమావేశాలను తరచూ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి తిరుపతి జిల్లా పరిధిలో 7 వేల ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు తాళాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ మేరకు హౌసింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ సమావేశాలను నిర్వహిస్తూ సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలాగా చొరవ చూపిస్తున్నాం.

ప్రజాశక్తి: జిల్లా పరిధిలో హౌసింగ్ పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎలా చేస్తు న్నారు?

హౌసింగ్ పీడీ: తిరుపతి జిల్లా పరిధిలో హౌసిం గ్ పథకంకు లబ్ధిదారు లను ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా గుర్తిస్తు న్నారు. అదే పట్టణ ప్రాంతాలలో అయితే డిమాండ్ సర్వే పేరిట లబ్ధిదారుల ఎంపిక జరుగు తోంది. తిరుపతి జిల్లా పరిధిలో మొదటగా 805 గ్రామ పంచాయతీలను సర్వే చేయడానికి ఇప్పటికే కార్యచరణను అమలు చేస్తున్నాం. ఇందులో ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఇంజనీర్, అవసరమైన చోట గ్రామ పంచాయతీ కార్యదర్శులను సర్వేకు వినియోగిస్తున్నాం.. పట్టణ ప్రాంతాలలో డిమాండ్ సర్వేను పూర్తి చేయడానికి వెబ్ మాడ్యూల్‌ని ఆపరేట్ చేయడానికి ఆ వార్డు అమినిటీస్ సెక్రటరీ పని చేస్తారు. కాస్త సాంకేతిక లోపం కారణంగా ఈ సర్వే కొంత ఆలస్యంగా సాగుతోంది. రాబోయే వారం రోజుల్లో పూర్తి స్థాయిలో సర్వే కొనసాగుతుంది.

వైభవంగా కార్తీక స్నపన తిరుమంజనం

ప్రజాశక్తి -తిరుమల: పవిత్ర కార్తీక మాసంలో నిర్వ హించే కార్తీక వన భోజన మహోత్స వంలో భాగంగా తిరుమల వైభవోత్సవ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామికి ఆదివారం స్నపన తిరు మంజనం వైభవం గా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం మలయప్ప స్వామి, ఉభయనాంచారులను ఊరేగింపుగా వైభవోత్సవ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవాలకు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాధారణంగా కార్తీక మాసంలో పార్వేట మండపంలో టీటీడీ వనభోజనం నిర్వహిస్తుంది. అయితే భారీ వర్ష హెచ్చరికల నేపథ్యంలో ఈ ఏడాది వేదికను తిరుమల ఆలయం ఎదురుగా ఉన్న వైభవోత్సవ మండపానికి మార్చారు. స్నపనం అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో సురేంద్ర, పేష్కర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం..నష్టం అసాధ్యం..

- సంప్రదాయ సేద్యం కనుమరుగు
- యాంత్రీకరణ మోజులో అధిక వ్యయం
- తగ్గిన సేంద్రీయ ఎరువుల వాడకం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని రైతులు యాంత్రీకరణ మోజులో పడి సంప్రదాయ సేద్యానికి స్వస్తి పలుకుతున్నారు. ప్రస్తుతం సంప్రదాయ బద్ధంగా సేద్యం చేసేవారు కనిపించడం లేదు. రైతులకు చేదోడు వాదోడుగా ఉండే కాడెద్దులు కనిపించడం లేదు. యంత్రాలతో పనులు నిర్వహించడం ద్వారా తక్కువ సమయంలో వ్యవసాయ పనులు పూర్తి అవుతున్నప్పటికీ సాగు ఖర్చు విపరీతంగా పెరిగింది. ఒకప్పుడు దుక్కి దున్నడం, సేంద్రీయ ఎరువులు వాడకం, చెరువులో మట్టి పొలాలకు తరలించడం వంటివి కాడెద్దులు చేసేవి. ఇప్పుడు ఏమి చేయాలన్న యంత్ర పరికరాలను ఉపయోగిస్తున్నారు. అధిక భాగం రైతులు వ్యవసాయానికి స్వస్తి చెప్పి ఇతర రంగాలను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో సంకరజాతి ఆవులు చూద్దామన్నా కనిపించడం లేదు. ఫలితంగా పంటల సాగులో సేంద్రీయ ఎరువుల వాడకం తగ్గి రైతులు రసాయనిక ఎరువులపై ఆధారపడి ఉన్నారు.

సేంద్రీయ వ్యవసాయం ఎంతో మేలు

సేంద్రీయ వ్యవసాయం చేయటానికి రైతుల కోసం ప్రభుత్వం ప్రతి పంచాయతీలలో చెత్త నుండి సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా రైతులకు ఎరువులు తక్కువ ధరలకే దొరికే అవకాశం వుంది. అయితే పంచాయతీలలో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదనే మాట గ్రామాల్లో వినిపిస్తుంది. చెత్త నుంచి సంపద కేంద్రాల్లో నుంచి వచ్చే ఎరువు మాత్రం అందరి రైతులకు అందించే విధంగా అధికారులు చర్యలు చేపడితే రైతులకు మేలు జరగడంతో పాటు పంట పొలాలకు భూసారం తప్పక పెరుగుతుంది. సేంద్రీయ వ్యవసాయం చేయడం ద్వారా నేలలోని సూక్ష్మజీవులను నిర్మూలించవచ్చు. దీని ద్వారా పురుగుల మందుల వాడకం తగ్గిపోతుంది. ఎలాంటి ఆర్థిక నష్టం లేకుండా పంట పొలాలను కాపాడుకోవచ్చు.

యాంత్రీకరణలో నష్టమే అధికం

యాంత్రీకరణలో భూమిని దుక్కిదున్నే సమయంలో ఎక్కువగా లోతుగా చేయడం వల్ల నేల కోతకు గురవుతుంది. రైతులకు దుక్కి దున్నే ఖర్చు భారం పెరుగుతుంది. భూమిలోని మూలాలు దెబ్బతింటాయి. ఆర్థిక భారం పెరుగుతుంది.

భారంగా దుక్కి వ్యవసాయం

వ్యవసాయం యంత్రాలతో చేయడం వల్ల ఆర్థికంగా ఖర్చు పెరిగిపోతుంది. గతంలో కాడెద్దులతో దుక్కి దున్నే వాళ్లం. ఇప్పుడు ట్రాక్టర్ కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ప్రస్తుతం పంటల సాగులో సేంద్రీయ ఎరువుల వాడకం చేపడితే బాగుంటుంది.

- సుధాకర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి.

సాగులో మెళుకువలు పాటించాలి..

రైతులు పంట సాగులో మెళుకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించాలి.

క్రైం న్యూస్

చెట్టును ఢీకొన్న క్యాటరింగ్ ట్రక్కు - ఇద్దరు మృతి

ప్రజాశక్తి - సత్యవేడు: చెట్టును క్యాటరింగ్ ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన సత్యవేడు మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కారు క్యాటరింగ్ సేవల్లో భాగంగా తడ నుంచి ట్రక్కు ద్వారా బిస్కెట్లు, టీ తీసుకొచ్చి శ్రీసిటీ కొలిక్స్ కంపెనీకి సరఫరా చేసింది. అనంతరం మినీ ట్రక్ తిరిగి వెళుతుండగా అదుపు తప్పి ట్రిబుల్ ఐటీ సర్కిల్ వద్ద మెయిన్ రోడ్డుకు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొంది. దీంతో వాహనం ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో డ్రైవర్ అజయ్ రామ్, మనోజ్ సింగ్ మృతి చెందారు. డ్రైవర్ వాహనాన్ని అతి వేగంగా నడపడం వల్లే అదుపు తప్పడంతో చెట్టును ఢీకొందని ఈ సందర్భంగా శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు. తడలో నడుస్తున్న కార్ క్యాటరింగ్ సేవల్లో మృతి చెందిన ఇద్దరు పని చేస్తున్నారు. వీరిద్దరూ బీహార్ రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: రోడ్డుప్రమాదంలో కార్మికుడు గాయపడిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. సిసిఎల్ కంపెనీలో పనిచేస్తున్న కొప్పల బెల్ల (30) ఉదయం ఫస్ట్ షిఫ్ట్ కి వెళ్లేందుకు కనమనంబేడు గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గ్రానైట్ ఫ్యాక్టరీ సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టును తప్పిస్తుండగా ఎదురుగా లారీ రావడంతో తప్పని పరిస్థితిలో చెట్టుకు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం లో తీవ్రంగా గాయపడగా అటుగా వస్తున్న ఆటో డ్రైవర్ గుర్తించి అంబులెన్సు లో శ్రీకాళహస్తి ఎంజిఎం ఆసుపత్రిలో చేర్చారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసరా పథకం ద్వారా డాక్టర్ జనార్ధన్ రెడ్డి , డాక్టర్ రోహిణి లు ఆర్థిక సాయంతో 20 మంది వృద్ధులకు నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్షులు శ్రీకి రెడ్డి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా ప్రతి నెలా మూడవ ఆదివారం క్రమం తప్పకుండా ఆర్థిక సహకారమందిస్తూ ప్రోత్సహిస్తున్న డాక్టర్ జనార్దన్ రెడ్డి , డాక్టర్ రోహిణి కి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండి శ్రీనివాసులు రెడ్డి, దేశి రెడ్డి ప్రజేంద్ర రెడ్డి, ఎరమాక కృష్ణారెడ్డి, కిషోర్ రెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కెవిపిఎస్ పట్టణ కమిటీ ఎన్నిక

గూడూరు పట్టణ కమిటీని ఎన్నుకుంటున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ పరిధిలోని సిపిఎం కార్యాలయంలో కెవిపిఎస్ పట్టణ నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కెవిపిఎస్ పట్టణ అధ్యక్షులుగా దారా కోటేశ్వర రావు, కార్యదర్శిగా అడపాల ప్రసాద్, కమిటీ సభ్యులుగా సురేష్, మణి, మూత్యాలయ్య, శంకరయ్య, వెంకటరమణయ్య, నరసింహులు, వెంకటరమణయ్య , ధనమ్మ, వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సమావేశంలో సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివ కుమార్, చంద్రయ్య, గుర్రం రమణయ్య పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవ భోజనాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి దివ్యారామంలో ఆదివారం తోట కుటుంబాల సామూహిక కార్తీకమాస దామోదర వ్రత పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత కలశ స్థాపన చేసి, గణపతి పూజ, నవగ్రహ శాంతి పూజ నిర్వహించారు. తులసి, ఉసిరి మొక్కలకు నూతన వస్త్రాలను అలంకరించి దామోదర వ్రతం, సుమంగళి పూజ నిర్వహించారు. అనంతరం తోట కుటుంబాల వారు వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు తోట బాలాజీ, తోట అమర్ నాథ్ మాట్లాడుతూ తాము ప్రతి ఏటా ఇలా కలుసుకుంటూ భక్తితో సేవాభావంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల తోట కుటుంబాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో రైతులకు మేలు: ఎమ్మెల్యే

వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతో రైతులకు మేలు కలుగుతోందని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. వడమాల పేట మండలం కాయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో భాగంగా ఎమ్మెల్యే వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు ఇబ్బందులు ఎదుదర్కొనే వారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సబ్సీడీ వేరుశనగ విత్తనాలు సక్రమంగా అందుతున్నాయన్నారు. అన్నదాత సుఖీభవకు బడ్జెట్లో నిధులు కేటాయించామని త్వరలోనే సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు ఏడీఈ ఆర్ రమేష్ రాజు, ఏవో విజయ్ కుమార్, ఎంపీపీ విజయలక్ష్మి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జానా వెంకటయ్య, ఉపాధ్యక్షులు రవి రెడ్డి, అధికార ప్రతినిధి ధనుంజయ, కార్యదర్శి మణి రాజు , దేవరాజులు, హరి, ఉమాపతిరావు, అంజయ్య, శివ రాయల్, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా ఆర్కాట్ కృష్ణప్రసాద్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి తిరుమల బైపాస్ రోడ్డులోని హోటల్ లోటస్ గ్రాండ్‌లో లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోధ్ హాస్పిటల్ అధినేత డాక్టరు పసుపులేటి హరిప్రసాద్ , అతిథులుగా లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు చంద్ర రెడ్డి, భక్తవత్సల రెడ్డి, ప్రతాప్ యాదవ్‌లు విచ్చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు సమక్షంలో లయన్స్ క్లబ్ తిరుపతి శ్రీశ్రీనివాస వ్యవస్థాపక అధ్యక్షులుగా ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె సి లోకేష్ , మబ్బు వాసుదేవరెడ్డి , కార్యదర్శిగా జగన్నాధం, కోశాధికారిగా బెల్లంకొండ సురేష్, కోర్డినేటర్ జి డాక్టరు వంశి, డైరెక్టర్లుగా ఈశ్వర్ రెడ్డి , ఈశ్వర్ ప్రకాష్, బాసికర్ల రఘు, కమలమ్మ , శాంతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో సేవాగుణం కలిగి ఉండాలని, దానికి మంచి విలువలు గల సంస్థ ను ఎంచుకోవడం చాల ముఖ్యమని, అందులో ప్రపంచప్రఖ్యాతిగాంచిన లయన్స్ క్లబ్ సంస్థలో సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్నాధం, బాసికర్ల రఘు, లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు రామచంద్ర రెడ్డి, సోమయ్య , వికాస్, రాజేంద్రప్రసాద్, శేషాద్రి పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో మంత్రి లోకేష్ ను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలిశారు. అనంతరం నారా వారిపల్లెలో రామ్మూర్తి నాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, కరి వర్ధన్, ఆరుముగం పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ఎంబీ రోడ్‌లో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు చిత్ర పటానికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు ఆధ్వర్యంలో ఆదివారం పూలమాల వేసి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యేగా కాణిపాకం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. తన రాజకీయ అభివృద్ధికి ఎంతో సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవినాయుడు, దనపాల్, పాండు రంగయ్య,హెచ్ సుబ్రహ్మణ్యం, కుమార్ రెడ్డి, రవి యాదవ్, అరవ ప్రకాష్, పోతుగుంట రవిచంద్ర బాబు, శేఖర్ రెడ్డి, సారధి, పోతుగుంట రమేష్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలి

ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

విద్యార్థినులను పరామర్శిస్తున్న శంకర్‌నాయక్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి గిరిజన గురుకుల బాలికల వసతి గృహం విద్యార్థినులు త్వరితగతిన కోలుకునే విధంగా మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ వైద్యాధికారులను ఆదేశించారు. తిరుపతి ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో 17 మంది అస్వస్థతకు గురై రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు అప్పమ్మ, గాయత్రి, అపర్ణను ఆదివారం పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలను ఆసుపత్రి వైద్యులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులను కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై అధికారులతో కమిటీని నియమిస్తామని, బాధితులకు అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. ఆహార పదార్థాలు తయారీ, మానవ తప్పిదమా? లేదా వంటకు ఉపయోగించే వస్తువులు, తదితర కారణాల వల్ల ఇలాంటి ఘటన జరిగి ఉండవచ్చని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేసి నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా గిరిజనులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా వెంటనే తాము సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుని బాధితులకు అండగా నిలుస్తున్నామన్నారు. విద్యార్థినులు పూర్తిగా ఆరోగ్య పరిస్థితి కుదుట పడిన తరువాత మాత్రమే ఆసుపత్రి నుండి పంపాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు మల్లికార్జున, గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

అబద్ధపు కేసు నుంచి భర్తను విడిపించండి: మౌనిక

మాట్లాడుతున్న మౌనిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తప్పుడు కేసులు పెట్టి తన భర్తను జైలు పాలు చేశారని చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పోలవరం గ్రామపంచాయతీ చింతమాకుల పల్లికి చెందిన పి మౌనిక మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తనకు వరుసకు మేనమామ అయిన చరణ్ ను 2023 సంవత్సరంలో పెద్దలను, స్థానిక రాజకీయ నాయకులను, గ్రామ పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నామన్నారు. అయితే మొదటి కుటుంబ కలహాలు ఉన్నా తరువాత సద్దుమణిగాయన్నారు. తనకు తన భర్తకు మధ్య గొడవ జరిగిందని ఈ క్రమంలో తన భర్త చేయి చేసుకోవడంతో మనస్థాపం చెందిన తాను విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డానని, అనంతరం తన భర్త, అత్తమామలు తనను హాస్పిటల్లో చేర్చారని, ఈ గొడవను ఆసరా చేసుకొని తమ తండ్రి ఈశ్వరయ్య, తల్లి రేవతి, వివాహానికి ముందు పంచాయితీ చేసిన వైసిపి నాయకులు నిరంజన్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, కె. కుట్టి, గతంలో జరిగిన విషయాలను మనసులో ఉంచుకొని పూతలపట్టు పోలీస్ స్టేషన్ సీఐ కృష్ణమోహన్ సహకారంతో తన వాంగ్మూలం తీసుకోకుండానే తన భర్తపై కట్నం వేధింపు కేసు, తన మామ నాతో తప్పుగా ప్రవర్తించాడని, తమ అక్క సావిత్రమ్మ చిత్ర హింస లకు గురి చేసిందని తప్పుడు కేసు బనయించారని ఆరోపించారు. ఆస్పత్రి నుండి కోలుకున్న తాను తన భర్త గురించి అడగగా 'నీ భర్త నువ్వు చనిపోతావని పరారీలో ఉన్నాడని, అబద్ధం చెప్పి తన తల్లిదండ్రులు ఇంటికి తీసుకువచ్చి ఇంట్లో గృహనిర్బంధం చేశారన్నారు. తన భర్త, మామ, అత్త జైల్లో ఉన్నారని ఆలస్యంగా తెలిసిందన్నారు. తమ తల్లిదండ్రులు వేరొకరితో వివాహం చేయాలని ఇబ్బంది పెట్టారని, గర్భంతో ఉన్న నన్ను అబార్షన్ చేసుకోవాలని ప్రేరేపించారన్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటి నుండి తప్పించుకుని బంధువుల సాయంతో మీడియా ముందుకు వచ్చానని తెలిపారు. తన భర్తను విడిపించి న్యాయం చేయాలని, తన ప్రమేయం లేకుండా భర్తను జైలు పాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- కనీస వేతనం రూ.22 వేలు ఇవ్వాలి - ఏజెన్సీ వద్దు.. ఆప్కాస్‌లో కొనసాగించాలి
- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుమన్

మాట్లాడుతున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్, సిటీ: ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుమన్ డిమాండ్ చేశారు. బాబు జగ్జీవన్‌రామ్ భవన్ లో జిల్లాస్థాయి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు తీవ్రంగా అన్యాయం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత తమ సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనం 22 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మిక కుటుంబాలు కూడా వర్తింప చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ లో పనిచేస్తున్న సీనియర్ ఉద్యోగులకు కొత్తగా చేరే ఉద్యోగులకు ఒకే వేతనం ఉందని, దాన్ని సవరించి సీనియర్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనం ఎక్కువ ఇవ్వాలని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెరగకపోవడంతో కాంట్రాక్ట్ కార్మికులు అవస్థలు వర్ణనాతీతంగా మారిందన్నారు. ప్రతి అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి సీనియార్టీ ఉన్నవారికి యానువల్లి ఇంక్రిమెంట్ పెంచాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి సంపత్ కుమార్, ఎస్వీ కృష్ణ, ఏపీ జెఎసి జిల్లా ఛైర్మన్ గోపీనాథ్ రెడ్డి, ఏపీ జెఎసి తిరుపతి జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి వేణు, రాష్ట్ర కార్యదర్శులు ఈ మధు బాబు, సుధీర్ కుమార్, వర్కింగ్ ప్రసిడెంట్ షేక్ కరీముల్లా, పురుషోత్తం రెడ్డి, ధనుంజయులు ,బాలు, జ్ఞాన శేఖర్ పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా అసోసియేషన్ అడహాక్ కమిటీ ఏర్పాటు

కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా శాఖ అడహాక్ కమిటీని సమావేశంలో నియమించారు. వీరిలో జిల్లా అధ్యక్షులుగా షేక్ కరిముల్లా (తిరుపతి నగరపాలక సంస్థ) ప్రధాన కార్యదర్శిగా పనబాక హేమంత్ కుమార్(సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్) అసోసియేట్ అధ్యక్షులుగా ఉదయ్ కుమార్ (టిటిడి), ఉపాధ్యక్షులుగా చిన్న అంకయ్య (స్వచ్ఛభారత్), అర్జున్ నాయక్ (ఆర్టీసీ ఔట్సోర్సింగ్), గోపి (స్పోర్ట్స్), వేణుగోపాల్ రెడ్డి (తిరుపతి నగర్ పాలకసంస్థ), ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాబు నాయుడు (వెటర్నరీ), కోశాధికారిగా నాగరాజు (పంచాయతీరాజ్ ఇంజనీరింగ్), జిల్లా కార్యదర్శిగా శేఖర్ (ఆర్‌డబ్ల్యూఎస్), సుధాకర్ (సోషల్ వెల్ఫేర్), సతీష్ (టెక్స్టైల్ డిపార్టుమెంట్), ఇర్ల రాము (శ్రీకాళహస్తి మున్సిపాలిటీ), ఉదయ్ కుమార్ (తిరుపతి నగర పాలక సంస్థ), శేఖర్ (సోషల్ వెల్ఫేర్) 15 మందితో జిల్లా అడహాక్ కమిటీని నియమించి రాష్ట్ర కమిటీ నూతనంగా నియమితులైన వారిని అభినందించారు.

స్థాయిని మరిచి మాట్లాడితే సహించం: టిడిపి

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పెళ్లకూరు: మాజీ ఎండి సిసిబి ఛైర్మన్ కానీరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడిన మాటలు తగవని సీనియర్ టిడిపి నాయకుడు మాజీ ఆయకట్టు ప్రసిడెంట్ పేరం రమేష్ నాయుడు పేర్కొన్నారు. పెళ్లకూరు మండలం పెళ్లకూరు గ్రామంలో పేరం రమేష్ నాయుడు ఇంటి వద్ద సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు మృతికి పెళ్లకూరు టిడిపి నాయకులు ఆదివారం నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎండిసిసిబి ఛైర్మన్ కానీరెడ్డి సత్యనారాయణరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాటలు తగవన్నారు. మండల టిడిపి కార్యదర్శి నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ దోపిడీకి అలవాటు పడిన కామిరెడ్డి ప్రస్తుతం ఏం చేస్తున్నాడు? ఆయనకే అర్థం కావడం లేదన్నారు. ఒకప్పుడు వాహనాల ద్వారా ప్రతి గ్రామానికి మద్యాన్ని తరలించి బెల్ట్ షాపులు నిర్వహిం చిన ఈ పెద్దమనిషి నీతులు వర్ణించడం దెయ్యాలు వేదాలు వర్ణిం చి నట్లు ఉంద న్నాడు. 2014 సంవత్స రం తర్వాత మహిళల సంక్షే మం వారి కుటుం బం సుభిక్షంగా ఉండాలని వైన్ షాపుల జోలికే వెళ్లనని ప్రతిజ్ఞ చేసి ప్రస్తుతం బెల్ట్ షాపులు నడపడం సిగ్గుచేటని ,ఎవరికో వచ్చిన షాపును అడ్డం పెట్టుకొని వక్రంగా మాట్లాడడం నీ స్థాయికి తగదన్నారు. కందమూరి శివకుమార్, మురళి రెడ్డి , చైతన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆయన ప్రవర్తన మార్చుకోవాలని లేకుంటే చట్టపరంగా బుద్ధి చెబుతామని రమేష్ నాయుడు హెచ్చరించారు. ఈ సమావేశంలో రాకేష్ రెడ్డి, లోకేష్ నాయుడు, వేణు రెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఉత్తరాది మఠం పీఠాధిపతిని కలిసిన టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి -తిరుమల: ఉత్తరాది మఠం పీఠాధిపతి శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మర్యాద పూర్వ కంగా కలిశారు. తిరుమల లోని ఉత్తరాది మఠానికి ఛైర్మన్ దంపతులు ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భం గా ఛైర్మన్ దంప తులకు స్వామీజీ ఆశీర్వచనం అందించారు. అనంతరం టీటీడీ సనాతన ధర్మవ్యాప్తిని విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్వామీజీ ఛైర్మన్ కు సూచించారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ప్రదర్శన నిర్వహిస్తున్న స్కౌట్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని స్కౌట్స్ మాస్టర్ షేక్ అజారుద్దీన్ అన్నారు. స్థానిక బాబుఅగ్రహారం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు లార్డ్ బేడన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక పెళ్లి మండపం, బేరివారి మండపం, భిక్షాల గాలి గోపురం వద్ద ట్రాఫిక్ పై ప్రజల్లో ప్ల కార్డులతో అవగాహన కల్పించారు. స్కౌట్స్ సహాయ కమిషనర్ పార్వతి, తనాజ్, సాయికిరణ్, సాయి పాల్గొన్నారు.

కూరగాయలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జెవివి ఆధ్వర్యంలో సంఘం డెయిరీ మాధవ రెడ్డి దాతృత్వంలో ప్రత్యేక ప్రతిభావంతులకు ఆదివారం కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన తన స్నేహితుడు మాధవ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జెవివి గత15 నెలలుగా ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రతి నెల మూడవ ఆదివారం కూరగాయలు, గుడ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం జెవివికి ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులు వారికి తెలిసిన చేతి వృత్తులను ఎంచుకుని తద్వారా ఆదాయాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. అవసరం అయితే జెవివి అండగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, గుర్రం విజయ్ బాబు, సుమన్ రెడ్డి, ఇబ్రహీం, జానా సుధీర్ పాల్గొన్నారు.

24న కార్తీక వనభోజన మహోత్సవం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈ నెల 24వ తేదీ చంద్రగిరి మండలం తొండవాడ శివాలయం లో చేపట్టే కార్తీక వనభోజన మహోత్సవానికి ఆర్యవైశ్య కుటుంబ సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని తిరుపతి ఆర్యవైశ్య కార్తీక సంధ్య అకాడమీ గౌవర అధ్యక్షులు దిండుకుర్తి నరసింహులు పిలుపు నిచ్చారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్తీక వనభోజన మహోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఇందులో భాగంగా లక్కీ డిప్ ద్వారా రెండు జంటలను ఎంపిక చేసి అన్నవరం సత్యనారాయణ స్వామి ధర్మన అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. హాజరైన సభ్యులలో బంఫర్ డ్రా ద్వారా ఎంపికైన ఒకరికి గ్రాము బంగారు నాణేన్ని బహుమతిగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్యులు అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో అకాడమీ ప్రతినిధులు సురేష్, శ్యాంసుందర్, రామ్మూర్తి, పామిడి రామ్మూర్తి పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక తొట్టంబేడు గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవశ్యకతను కవులు కవితా పఠనం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ పుస్తకం హస్త భూషణం అని, మంచి పాఠకుడు మంచివక్త కావచ్చన్నారు. అనంతరం కవి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత కయ్యూరి బాల సుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు.

'విద్యార్థుల హక్కులు కాపాడాలి'

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రభుత్వాలు విద్యార్థుల హక్కులు కాపాడాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఆ సంఘం తిరుపతి జిల్లా సభ ఎస్వీ యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ అరుణ పతాక ఆవిష్కరణ మాజీ ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మోహన్ కుమార్ చేసి, వందలాది మంది విద్యార్థులతో తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో భారీ ర్యాలీ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కాణాల శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వలన పేదలకి విద్య అందని ద్రాక్ష లాగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ పుత్తూరు మాజీ నాయకులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బాలగురవంబాబు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బాలగురవంబాబు కోరారు. సత్యవేడు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సరైన వైద్యం అందడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రసిడెంట్ రమేష్ నాయుడుతో కలిసి ఆదివారం వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బాలగురుం బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పేద రోగులకు వైద్యం అందని ద్రాక్షలా మారిందని వ్యాఖ్యానించారు. తమ నాయకులతో ఆసుపత్రిని పరిశీలించే క్రమంలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, అనస్థీషియా పోస్టులు ఖాళీగా ఉండడంతో చిన్న చిన్న ఆపరేషన్లు, డెలివరీ కేసులను రిఫరల్ బాట పట్టించడం ఇక్కడ ఆనవాయితీగా మారి తద్వారా గర్భిణులు, రోగులు ఇబ్బందులకు గురికావడం బాధాకర విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. కంటి, ఈఎన్టి వైద్య నిపుణులు విధుల్లో ఉన్నప్పటికి వైద్య చికిత్సకు సంబంధించిన పరికరాలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సాంకేతిక ఆపరేటర్ సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆక్సిడెంట్ ప్లాంట్ అలంకాయప్రాయంగా దర్శన మిస్తుందన్నారు. చాలీచాలని వైద్య నిపుణులతో, వైద్య చికిత్సకు అవసరమయ్యే పరికరాలు లేకుండా ఎలా రోగులకు మెరుగైన వైద్యం అందిస్తారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఆరోగ్య ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం వల్లే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఈ దుస్థితిలో

కొనసాగడానికి కారణమన్నారు. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్య తీరుతెన్నుల వల్లే రోజుకో ఆర్ఎంపి క్లినిక్‌పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమస్యలపై స్థానిక వైద్యులతో చర్చించి డిసిహెచ్ఎస్ ఆనందమూర్తితో ఫోను ద్వారా సంప్రదించి సమస్యలను వివరించారు. వెంటనే ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు. తదనంతరం జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలకు చేరుకొని మూడు రోజులుగా వైరల్ జ్వరంతో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వారి బాగోగులను విచారించారు. పాఠశాలలో వైద్యం అందిస్తున్న వైద్యులతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై చర్చించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. పాఠశాలను పరిశీలించి మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో పాఠశాల యాజమాన్య సిబ్బందిపై మండిపడ్డారు. వైరల్ జ్వరం విద్యార్థుల్లో మరింత ప్రబలకుండా పాఠశాల గదులను, మరుగు దొడ్లను పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్య కమిటీ అధ్యక్షులు సురేష్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రఘునాథ్, జిల్లా ట్రెజరర్ వేల్ రెడ్డి, మండల ట్రెజరర్ గురవయ్య, టౌన్ ప్రసిడెంట్ అంబేద్కర్, బీసీ వైస్ ప్రసిడెంట్ మురుగేష్, యూత్ మండల వైస్ ప్రసిడెంట్ తమిళ అరసన్ పాల్గొన్నారు.

అరాచకాలు ఆపకుంటే న్యాయపోరాటం: వైసిపి

మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలను ఆపకపోతే న్యాయ పోరాటానికి సిద్ధమవుతామని వైసిపి రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి సోషల్ మీడియాను బూచిగా చూపిస్తూ కార్యకర్తలను అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం దారుణం అన్నారు. కూటమి అరాచక నిర్ణయాలకు పోలీసులు వత్తాసు పలుకుతూ డిజిపీ నుండి ఎస్ఐ స్థాయి వరకు కక్ష సాధింపులతో సోషల్ మీడియా అణిచివేతకు పౌరహక్కులను కాలరాస్తున్నారన్నారు. అభ్యంతరకర పోస్టులను పోస్టు చేసే వారిని విడిచిపెట్టి వైసిపి సోషల్ మీడియాను లక్ష్యం చేసుకోవడం శోచనీయమన్నారు. రాయలసీమకు చెందిన సీఎం చంద్రబాబు నాయుడు ఏనాడూ రాయలసీమ అభివృద్ధిని కోరుకోలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా విభజన తర్వాత కూడా రాయలసీమకు వెనుక బాటు తనం తప్పలేదన్నారు. కర్నూలు ను న్యాయ రాజధానిలో భాగంగా అక్కడ గత ప్రభుత్వం లోకా యుక్త, మానవ హక్కుల విభాగం, హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు. వీటిని అధికారం లోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమరావతికి తరలింపునకు పాల్ప డడం చూస్తుంటే రాయలసీమకు చేసిన అన్యాయం కాదా ?అని ప్రశ్నించారు. మద్యం, ఎర్రచందనంపై ఉన్న శ్రద్ధ కూటమి ప్రభుత్వానికి రాయలసీమపై లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైసిపి లీగల్ సెల్ ప్రతినిధులు నరహరిరెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్, సోమేశ్వరన్, శ్రీరాములు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.